# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 18 సంచిక: 352 | మంగళవారం, 19 ఆగస్ట్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com


# ఇదొక చెత్త సర్కారు

**ఎక్కడ చూసినా నీరు, చెత్త కుప్పల దర్శనమే**

**వ్యాధులతో ఇబ్బంది పడుతున్న ప్రజలు**

**రోగులతో ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానలు నిండుతున్నాయి**

**'ఎక్స్' వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు పనితీరు పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో శాఖల సమన్వయ లోపంతో ఎక్కడ చూసినా మురుగు నీరు, చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయని మండిపడ్డారు. వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఇదొక 'చెత్త' సర్కారు..!. రాష్ట్ర మున్సిపల్ శాఖ, ఆరోగ్య శాఖల సమన్వయ లోపంతో ఎక్కడ చూసినా మురుగు నీరు,

..మిగతా 2లో



## మత ప్రాతిపదికన ఏ రిజర్వేషన్లు ఉండవు

**సర్దార్ సర్వాయి పాపన్నకు సముచిత గౌరవం ఇవ్వడమే మా ప్రభుత్వ ధ్యేయం**

**రాహుల్ గాంధీ సూచనలను అమలు చేయడమే మా లక్ష్యం**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

02



## భారతీయ సినిమా నిర్మాణ కేంద్రంగా హైదరాబాద్

**హైదరాబాద్‌ను సినిమా కేంద్రంగా అభివృద్ధి చేస్తాం**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**జాతీయ ఫిల్మ్ అవార్డ్స్ విజేతలతో భేటీ**

**సినీ పరిశ్రమ సవాళ్లపై సీఎం దృష్టికి అంశాలు**

**అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం**

02



# ఓట్ల చోరీకి పాల్పడేవారి భరతం పడదాం

**కుల గణనలో వంద శాతం ఖచ్చితత్వం ఉందన్న సీఎం**

**రిజర్వేషన్ బిల్లులను పెండింగ్‌లో ఉంచిన రాష్ట్రపతి పై విమర్శ**

**65 లక్షల ఓట్లు తొలగింపు రాహుల్ గాంధీ బహిర్గతం**

**ఓట్ల చోరీకి వ్యతిరేకంగా పాదయాత్రలో పాల్గొననున్న రేవంత్**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణలో కుల గణనను పకడ్బంధీగా నిర్వహించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రవీంద్రభారతిలో సర్వాయి పాపన్న విగ్రహ స్థాపన శంకుస్థాపన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా కుల గణనను పూర్తి చేశామని, వందకు వంద శాతం సరిగ్గా లెక్కలు నమోదయ్యాయని తెలిపారు. ఈ గణన లెక్కలను వక్రీకరిస్తే మళ్లీ వందేళ్లైనా రిజర్వేషన్ల వ్యవస్థను సరిచేయడం అసాధ్యమని ఆయన హెచ్చరించారు. అంతేకాకుండా రిజర్వేషన్ బిల్లులను రాష్ట్రపతి ఐదు నెలలుగా ఆమోదించకుండా పెండింగ్‌లో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వాయి పాపన్న గౌడ్‌కి సరైన గుర్తింపు రావాల్సిన సమయం ఇదేనని, ఖిలాషాపూర్ కోటను గత ప్రభుత్వం మైనింగ్ కోసం లీజుకు ఇచ్చిందని సీఎం రేవంత్ విమర్శించారు. ఇచ్చిన హామీలను నిజాయితీగా అమలు చేస్తున్నామంటూ ఆయన స్పష్టం చేశారు. ఇక ఎన్నికల విషయానికొస్తే, హార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారని సీఎం రేవంత్ ఆరోపించారు. బ్రతికున్న

..మిగతా 2లో

# ప్రజలు నిలదీయడం ఖాయం



**సచివాలయంలో కాంట్రాక్టర్ల ఆందోళన**

**కమీషన్లు ఇచ్చిన బడా కాంట్రాక్టర్లకు బిల్లులు క్లియర్..**

**చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా సర్కార్ వేధిస్తోంది**

**రేవంత్ సర్కార్ హెచ్చరించిన హరీశ్‌రావు**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో కాంట్రాక్టర్లు మరోసారి ఆందోళనకు దిగారు. కమీషన్లు ఇచ్చిన బడా కాంట్రాక్టర్లకు బిల్లులు క్లియర్ చేస్తూ.. చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కార్ వేధిస్తోందని వారు ఆరోపించారు. ఈ నేపథ్యంలో సెక్రటేరియట్‌లోని సీఎం రేవంత్ రెడ్డి చాంబర్ ముందు బిల్లుల కోసం నిరసన చేపట్టారు. 20 నెలల్లోనే రూ.2లక్షల కోట్లకుపైగా అప్పులు చేసిన రేవంత్ సర్కార్..

..మిగతా 2లో

# కృష్ణాష్టమి వేడుకల్లో అపశ్రుతి

**రామంతాపూర్‌లోని గోకులేనగర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఘటన**

**శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిన్న రాత్రి స్థానికంగా రథ యాత్ర**

**రథాన్ని లాగుతున్న వాహనం చెడిపోవడంతో దాన్ని పక్కకు నిలిపివేసిన యువకులు**

**రథాన్ని చేతులతో లాగుతూ ముందుకు తీసుకెళ్లే క్రమంలో 9 మందికి విద్యుద్ఘాతం**

**ఐదుగురు అక్కడికక్కడే మృతి.. మరో నలుగురికి ఆసుపత్రిలో చికిత్స**



02



## సబితా ఇంద్రారెడ్డికి హైకోర్టు నోటీసులు

**ఓబులాపురం మైనింగ్ కేసులో...**

**నిర్దోషులుగా తేల్చుతూ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేసిన సీబీఐ**

**సబితతో పాటు మాజీ ఐఏఎస్ కృపానందకు నోటీసులు జారీ**

02



## అతి భారీ వర్షం

**రాబోయే 24 గంటలు భారీ వర్షాలు**

**నాలుగు జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్**

**జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు..**

**19 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన ఐఎండీ**

**10 జిల్లాలకు ఎల్లో అలర్ట్**

02



# దీపావళికి చౌకగా కార్లు, బైకులు!

**దీపావళికి 'డబుల్ బొనాంజా' ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీ**

**భారీగా తగ్గనున్న కార్లు, ద్విచక్ర వాహనాల ధరలు**

**28 శాతం జీఎస్టీ శ్లాబును 18 శాతానికి తగ్గించేందుకు కేంద్రం ప్రతిపాదన**

**మధ్యతరగతి, సామాన్యులకు ఊరట కల్పించడమే లక్ష్యమన్న కేంద్రం**

**సెప్టెంబర్‌లో భేటీ కానున్న జీఎస్టీ కౌన్సిల్, తుది నిర్ణయానికి అవకాశం**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

పండగ సీజన్‌కు ముందు సొంత వాహనం కొనాలనుకునే సామాన్యులు, మధ్యతరగతి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించనుంది. కార్లు, ద్విచక్ర వాహనాలపై ప్రస్తుతం ఉన్న వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను గణనీయంగా తగ్గించేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ దీపావళికి సామాన్యులకు 'డబుల్ బొనాంజా' అందిస్తామని, వస్తువుల ధరలు తగ్గేలా జీఎస్టీలో సంస్కరణలు తీసుకొస్తామని

..మిగతా 2లో



## అమెజాన్‌లో ఉద్యోగాల జాతర

**పండగ సీజన్ కోసం అమెజాన్ భారీ నియామకాలు**

**దేశ వ్యాప్తంగా 1.5 లక్షల మందికి ఛాన్స్**

**హైదరాబాద్ సహా 400 నగరాల్లో అవకాశాలు**

**మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేక ప్రాధాన్యత**

**ఉద్యోగులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, ముందస్తు జీతం సౌకర్యం**

**ఫుల్‌ఫిల్‌మెంట్, డెలివరీ విభాగాల్లో ఉద్యోగాలు**

02



04

## ప్రచారం బాధ్యత మీదే

**అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**సోషల్ మీడియా వారియర్లతో సమావేశం**

# ఇదొక 'చెత్త' సర్కారు

మొదటిపేజీ తరువాయి



చెత్త కుప్పలతో హైదరాబాద్ నగరం, రాష్ట్రంలోని ఇతర పట్టణాలు కంపుకొడుతున్నాయి. ఈ వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానలు రోగులతో కిటకిటలాడుతున్నాయి.' అని కేటీఆర్ పేర్కొన్నారు. 'బీఆర్ఎస్ హయాంలో వర్షాకాలానికి 2 నెలల ముందు నుంచే సీజనల్ వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలపై మున్సిపల్ శాఖ, జీహెచ్ఎంసీ, వైద్య ఆరోగ్య శాఖలు సమీక్షా, సమన్వయ సమావేశాలు నిర్వహించి, ముందస్తు చర్యలు చేపట్టేవి. కానీ ఇప్పుడా పరిస్థితులు కనిపించడం లేదు. ప్రజలు ఈసురోమని అలమటిస్తుంటే పాలకులు మాత్రం 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్లలో బిజీగా ఉన్నారు..!' అంటూ కాంగ్రెస్ సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు.

**ఐదుగురి మృతి నన్ను కలచివేసింది**

రామంతాపూర్ గోకులేనగర్‌లో శ్రీకృష్ణాష్టమి ఊరేగింపులో జరిగిన దుర్ఘటన అత్యంత విషాదకరమని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. విద్యుదాఘాతానికి గురై ఐదుగురు యువకులు మృతిచెందడం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. పండగ వేళ జరిగిన ఈ దుర్ఘటన చాలా బాధాకరమని చెప్పారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రామంతాపూర్‌లోని గోకులేనగర్‌లో ఆదివారం అర్ధరాత్రి తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు రథానికి విద్యుత్ తీగలు తగిలి ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు.

# దీపావళికి చౌకగా కార్లు, బైకులు!

మొదటిపేజీ తరువాయి

స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించడంతో ఈ వార్తకు మరింత ప్రాధాన్యత చేకూరింది. ప్రస్తుతం దేశంలో అమలవుతున్న నాలుగు అంచెల జీఎస్టీ విధానాన్ని రెండు శ్లాబులకు పరిమితం చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. 5 శాతం, 18 శాతం శ్లాబులను మాత్రమే కొనసాగించాలని తన ప్రతిపాదనను జీఎస్టీ కౌన్సిల్‌కు పంపింది. రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన ఈ కౌన్సిల్ సెప్టెంబర్‌లో సమావేశమై ఈ ప్రతిపాదనపై తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ మార్పులు అమలైతే ప్రస్తుతం 28 శాతం పన్ను పరిధిలో ఉన్న అనేక వస్తువులు, ముఖ్యంగా కార్లు, బైకులు 18 శాతం శ్లాబులోకి వస్తాయి. ప్రస్తుతం ప్యాసింజర్ కార్లపై 28 శాతం జీఎస్టీతో పాటు ఇంజిన్ సామర్థ్యం, పొడవును బట్టి 1 శాతం నుంచి 22 శాతం వరకు పరిహార సెస్సు విధిస్తున్నారు. దీనివల్ల మొత్తం పన్ను భారం 50 శాతం వరకు ఉంటోంది. అదేవిధంగా, ద్విచక్ర వాహనాలపై కూడా 28 శాతం జీఎస్టీ అమలవుతోంది. కొత్త విధానంలో 12 శాతం, 28 శాతం శ్లాబులను తొలగించనుండటంతో మాస్ మార్కెట్ కార్లు, బైకుల ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. అయితే, లగ్జరీ కార్లు వంటి కొన్ని వస్తువులపై 40 శాతం వరకు ప్రత్యేక పన్ను విధించే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. ఈ దీపావళికి ప్రజలకు మేం ఓ బహుమతి అందిస్తున్నామని, సామాన్యులకు అవసరమైన వస్తువులపై పన్నులు భారీగా తగ్గుతాయని ప్రధాని మోదీ తెలిపారు. "దీనివల్ల రోజువారీ వస్తువులు చాలా చౌకగా మారతాయి. ఇది ఆర్థిక వ్యవస్థకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తుంది" అని ఆయన వివరించారు. పెరిగిన ఉత్పాదక వ్యయం, అధిక వడ్డీ రేట్ల కారణంగా కొన్నేళ్లుగా ఎంట్రీలెవెల్ కార్లు, బైకుల అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో పన్నులు తగ్గించాలని మారుతీ సుజుకీ, హీరో మోటోకార్ప్ వంటి ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలు చాలాకాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. జీఎస్టీ తగ్గింపు వార్తల నేపథ్యంలో నిఫ్టీ ఆటో ఇండెక్స్ ఒక్కరోజే 4.61 శాతం మేర లాభపడటం గమనార్హం.



# అతి భారీ వర్షం

- **రాబోయే 24 గంటలు భారీ వర్షాలు**
- **నాలుగు జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్**
- **జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు..**
- **19 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన ఐఎండీ**
- **10 జిల్లాలకు ఎల్లో అలర్ట్**

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

రాబోయే 24గంటల పాటు తెలంగాణకు భారీ నుంచి అత్యంత భారీ వర్ష సూచన హైదరాబాద్ వాతావరణ కేంద్రం తాజాగా పేర్కొంది. ఇందులో భాగంగా నాలుగు జిల్లాలకు ఐఎండీ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. అలాగే 19 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది ఐఎండీ. ఈ జిల్లాలో కూడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. వీటితోపాటు మరో 10 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. నేడు ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ పేర్కొంది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యంత భారీ వర్షాలు నమోదయ్యాయి. గత 24 గంటల్లో రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో అత్యంత భారీ, 12 ప్రాంతాల్లో అతి భారీ, 26 ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. ప్రజలు ఈ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# మత ప్రాతిపదికన ఏ రిజర్వేషన్లు ఉండవు

- **సర్దార్ సర్వాయి పాపన్నకు సముచిత గౌరవం ఇవ్వడమే తమ ప్రభుత్వ ధ్యేయం**
- **రాహుల్ గాంధీ సూచనలను అమలు చేయడమే మా లక్ష్యం**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సర్దార్ సర్వాయి పాపన్నకు సముచిత గౌరవం ఇవ్వడమే తమ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. సర్దార్ పాపన్న విగ్రహం ఏర్పాటు కోసం శంకుస్థాపన నిర్వహించిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. గత ప్రభుత్వం హుస్నాబాద్‌లోని పాపన్న కోటను లీజుకు ఇచ్చిందని, తాము అయితే ఆ కోటను సంరక్షించడానికి చర్యలు ప్రారంభించామని వెల్లడించారు. హుస్నాబాద్ నుంచి పొన్నం ప్రభాకర్‌ను పోటీ చేయించడం కూడా అదే భావనలోనుంచే జరిగిందని అన్నారు. సీఎం రేవంత్ గాంధీ కుటుంబాన్ని "దేశానికి గొప్ప వరం"గా అభివర్ణిస్తూ.. వారిచ్చే హామీ శిలాశాసనం లాంటిదేనని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ సూచించినట్లుగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ దిశగా రాష్ట్రవ్యాప్తంగా కుల గణనను నిబద్ధతతో పూర్తి చేసామని, తాము చేసిన సర్వేలో తప్పు ఎక్కడ ఉందో చూపించమని అసెంబ్లీలోనే సవాల్ చేశామని ఆయన పేర్కొన్నారు. రిజర్వేషన్ల అమలుకు సంబంధించి తీసుకున్న రాజకీయ, న్యాయ చర్యలను సీఎం వివరించారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రపతికి పంపినప్పటికీ అది ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉందని చెప్పారు. తాము తెచ్చిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించకుండా రాష్ట్రపతికి పంపించారని, కేంద్ర స్థాయిలో దానికి ఆమోదం వచ్చేలా చూడాల్సిన కేంద్ర నేతలు వాదనలతో కాలం గడుపుతున్నారని ఆక్షేపించారు. 2018లో కేసీఆర్ ప్రభుత్వం చేసిన చట్టమే ప్రస్తుతం 50 శాతం దాటి రిజర్వేషన్లు ఇవ్వడంలో అడ్డంకిగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా ఆయన మాట్లాడుతూ.. మత ప్రాతిపదికన ఏ రిజర్వేషన్లు ఉండవని స్పష్టం చేశారు. తాము పంపిన బిల్లు గానీ, ఆర్డినెన్స్ గానీ మతాధారిత రిజర్వేషన్లను ప్రతిపాదించలేదని సీఎం స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడమే లక్ష్యంగా "ముస్లిం" పేరుతో వాదనలు సృష్టిస్తున్నారని విమర్శించారు. మైనార్టీల రిజర్వేషన్లు ఇతర రాష్ట్రాలైన మహారాష్ట్ర, గుజరాత్ ఎలా అమలులో ఉన్నాయో కేంద్రం పరిశీలించాలని, అక్కడ తొలగించే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీపై కోపం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవచ్చని, కేసులు పెట్టవచ్చని.. కానీ, ఆయన నమ్మిన బీసీ సాధికారత సిద్ధాంతాన్ని దెబ్బతీయొద్దని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో బీసీలు ముందుకు రావడం రాహుల్ గాంధీ లక్ష్యమని, ఆ సూచనలను అమలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## ఓట్ల చోరీకి పాల్పడేవారి భరతం పడదాం

మొదటిపేజీ తరువాయి

వారిని చనిపోయినట్లుగా చూపించడం పెద్ద కుట్రలో భాగమని, ఈ అంశాన్ని రాహుల్ గాంధీ బహిర్గతం చేశారని అన్నారు. తప్పు చేసిన వారిని వదిలేసి, దాన్ని ప్రశ్నించిన రాహుల్ గాంధీని ఎన్నికల కమిషన్ అఫిడవిట్ అడగడం అన్యాయం అని తీవ్రంగా విమర్శించారు. ఓటు హక్కును దొంగిలించిన వారిని శిక్షించాలనే లక్ష్యంతో రాహుల్ గాంధీ పాదయాత్ర చేస్తున్నారని, త్వరలో తాను, ఉప ముఖ్యమంత్రి కలిసి ఆ పాదయాత్రలో పాల్గొని మద్దతు ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. ఓట్ల చోరీ చేసే కుట్ర తెలంగాణలో కూడా జరుగుతోందని ఆరోపించిన సీఎం, అలాంటి వారిని అంతా కలిసికట్టుగా ఎదిరించి భరతం పడదామని పిలుపునిచ్చారు.

# భారతీయ సినిమా నిర్మాణ కేంద్రంగా హైదరాబాద్

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

భారతీయ సినీ పరిశ్రమకు హైదరాబాదు కేంద్ర బిందువుగా మారాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. సినీ రంగ అభివృద్ధికి అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సోమవారం సాయంత్రం 71వ జాతీయ ఫిల్మ్ అవార్డ్స్‌లో వివిధ విభాగాల్లో ఎంపికైన పలువురు సినీ ప్రముఖులు ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను వారు సీఎంకు వివరించారు. ఆ తర్వాత అవార్డు గ్రహీతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సన్మానించారు. 'భగవంత్ కేసరి' దర్శకుడు అనిల్ రావిపూడి, 'హనుమాన్' దర్శకుడు ప్రశాంత్ వర్మ, అదే చిత్రానికి విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో పనిచేసిన వెంకట్, శ్రీనివాస్, వారి బృందం, ఫైట్ మాస్టర్స్ నందు, పృథ్వీ, 'బేబి' సినిమా దర్శకుడు సాయి రాజేశ్, గాయకుడు రోహిత్‌లను సీఎం ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో 'హనుమాన్' నిర్మాతలు చైతన్య రెడ్డి, నిరంజన్ రెడ్డి, 'బేబి' నిర్మాత ఎస్కేఎన్, 'భగవంత్ కేసరి' నిర్మాత గారపాటి సాహు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాష్టమి వేడుకల్లో అపశ్రుతి

- **రామంతాపూర్‌లోని గోకులేనగర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఘటన**

హైదరాబాద్, ప్రజాస్వరం :

హైదరాబాద్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఊరేగింపు రథానికి విద్యుత్ తీగలు తగలడంతో కరెంట్ షాక్ కారణంగా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం అర్ధరాత్రి రామంతాపూర్‌లోని గోకులేనగర్‌లో ఈ విషాద ఘటన జరిగింది. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిన్న రాత్రి స్థానికంగా రథాన్ని ఊరేగించారు. అయితే, రథాన్ని లాగుతున్న వాహనం చెడిపోవడంతో దాన్ని పక్కకు నిలిపివేసిన యువకులు.. రథాన్ని చేతులతో లాగుతూ ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో రథానికి విద్యుత్ తీగలు తగిలాయి. దాంతో రథాన్ని లాగుతున్న 9 మంది యువకులు కరెంట్ షాక్‌కు గురయ్యారు. స్పృహతప్పి పడిపోయిన వారిని వెంటనే స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. కానీ, అప్పటికే ఐదుగురు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మరో నలుగురికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గన్‌మెన్ శ్రీనివాస్ కూడా ఉన్నట్లు సమాచారం. మృతులను రుద్రవికాస్(39), కృష్ణ యాదవ్(21), శ్రీకాంత్ రెడ్డి(35), రాజేంద్రరెడ్డి(45), సురేశ్ యాదవ్ (34)గా గుర్తించారు. వారి మృతదేహాలను పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

**మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం**

**మంత్రి శ్రీధర్ బాబు**

రామంతాపూర్‌లోని గోఖలేనగర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు రథానికి విద్యుత్ తీగలు తగిలి ఆరుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. మృతుల కుటుంబాలను సోమవారం మంత్రి శ్రీధర్ బాబు పరామర్శించారు. రూ.5 లక్షల నష్టపరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి ఊరేగింపు చేపట్టారు. రథాన్ని లాగుతున్న వాహనం మరమ్మతుకు గురికావడంతో దాన్ని పక్కన నిలిపివేసిన యువకులు.. రథాన్ని చేతులతో లాగుతూ ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో రథానికి విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో రథాన్ని లాగుతున్న తొమ్మిది మందికి షాక్ కొట్టడంతో వారంతా ఒక్కసారిగా విసిరేసినట్లు దూరంగా పడిపోయారు. ఈ క్రమంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు.




# అమెజాన్‌లో ఉద్యోగాల జాతర

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

ప్రముఖ ఈకామర్స్ సంస్థ అమెజాన్ ఇండియా, రాబోయే పండగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా భారీగా తాత్కాలిక ఉద్యోగాలను సృష్టించింది. పెరిగిన డిమాండ్‌ను తట్టుకోవడానికి ఏకంగా 1.5 లక్షలకు పైగా సీజనల్ ఉద్యోగ అవకాశాలను కల్పించినట్లు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నిర్ణయం పండగ సమయంలో ఉపాధి కోసం ఎదురుచూస్తున్న వేలాది మందికి శుభవార్తగా నిలిచింది. దేశంలోని 400 నగరాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు కంపెనీ తెలిపింది. హైదరాబాద్, బెంగళూరు, ముంబై, ఢిల్లీ, పూణె, లక్నో, కొచ్చి వంటి ప్రధాన నగరాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, సార్టింగ్ కేంద్రాలు, లాస్ట్‌మైల్ డెలివరీ స్టేషన్లలో ఈ నియామకాలు చేపట్టనున్నారు. ఈ అవకాశాలలో వేలాది మంది మహిళలతో పాటు 2,000 మందికి పైగా దివ్యాంగులకు కూడా ప్రాధాన్యత ఇచ్చినట్లు అమెజాన్ పేర్కొంది. ఇప్పటికే చాలా మంది కొత్త సిబ్బంది విధుల్లో చేరినట్లు స్పష్టం చేసింది. ఈ విషయంపై అమెజాన్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ అభినవ్ సింగ్ మాట్లాడుతూ, "పండగ సీజన్ ముగిసిన తర్వాత కూడా చాలా మంది మాతో తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ప్రతి ఏటా ఎంతోమంది తిరిగి మాతో పనిచేయడానికి వస్తుండటం సంతోషంగా ఉంది. మా ఉద్యోగుల భద్రత, శ్రేయస్సుకు మేము అత్యంత ప్రాధాన్యత ఇస్తాం" అని వివరించారు. ఉద్యోగుల సంక్షేమం కోసం పలు చర్యలు తీసుకుంటున్నట్లు కంపెనీ తెలిపింది. డెలివరీ సిబ్బంది విశ్రాంతి కోసం దేశవ్యాప్తంగా 'ఆశ్రయ్' రెస్ట్ సెంటర్ల సంఖ్యను 100కి పెంచినట్లు పేర్కొంది. అలాగే, 80,000 మంది డెలివరీ అసోసియేట్లకు కళ్లు, దంతాలు, బీఎంఐ వంటి ఉచిత ఆరోగ్య పరీక్షలు అందిస్తున్నట్లు వెల్లడించింది. దీనితో పాటు, ఉద్యోగుల ఆర్థిక సౌలభ్యం కోసం ప్రతి నెల 20వ తేదీలోపు తమ జీతంలో 80 శాతం వరకు విత్‌డ్రా చేసుకునే 'ఎర్లీ యాక్సెస్ టు పే' (EATP) సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నట్లు కంపెనీ తన ప్రకటనలో వివరించింది.

# సబితా ఇంద్రారెడ్డికి హైకోర్టు నోటీసులు

- **ఓబుళాపురం మైనింగ్ కేసులో...**
- **సబితతో పాటు మాజీ ఐఏఎస్ కృపానందకు నోటీసులు జారీ**

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకురాలు సబితా ఇంద్రారెడ్డికి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో సబితా ఇంద్రారెడ్డితో పాటు మాజీ ఐఏఎస్ కృపానందానికి కూడా నోటీసులు జారీ అయ్యాయి. వీరిద్దరిని నిర్దోషులుగా తేల్చుస్తూ నాంపల్లి సీబీఐ కోర్టు గతంలో తీర్పు వెలువరించింది. సీబీఐ ఈ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ క్రమంలో ఉన్నత న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని వీరిద్దరిని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు మే నెలలో తుది తీర్పును వెలువరించింది. 15 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్ధన్ రెడ్డి, బీవీ శ్రీనివాస్ రెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనుల శాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది. గాలి జనార్ధన్ రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల జైలు శిక్షను ఖరారు చేసింది. దోషులకు రూ. 10 వేల చొప్పున జరిమానా కూడా విధించింది. అలాగే ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి రూ. 2 లక్షల జరిమానా విధించింది. ఈ కేసులో, అప్పటి గనుల శాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రా రెడ్డికి, నాటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందకు సీబీఐ కోర్టులో ఊరట లభించింది. వారిని నిర్దోషులుగా ప్రకటించడంతో సీబీఐ హైకోర్టుకు వెళ్లింది.



# ప్రజలు నిలదీయడం ఖాయం

మొదటిపేజీ తరువాయి

చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా వేధించడం దుర్మార్గమని మండిపడ్డారు. సెక్రటేరియట్‌లో కాంట్రాక్టర్ల ధర్నాపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు స్పందించారు. రెండేళ్ల పాలనలో పెండింగ్ బిల్లుల కోసం రెండు సార్లు సచివాలయంలో కాంట్రాక్టర్లు ధర్నా చేసే స్థితి రావడం దేశంలో ఇదే మొదటిసారి కావచ్చని అభిప్రాయపడ్డారు. మొన్న కమీషన్లు ఇవ్వకపోతే బిల్లులు క్లియర్ చేయడం లేదని కాంట్రాక్టర్లు సచివాలయంలోని ఆర్థిక మంత్రి కార్యాలయాన్ని ముట్టడించారని తెలిపారు. సోమవారం అదే సచివాలయం సెకండ్ ఫ్లోర్ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ముందు కాంట్రాక్టర్ల మెరుపు ధర్నా చేశారని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వడంలో సీనియారిటీ పాటించకుండా, కమీషన్లు దండుకుంటున్నారు అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం ఉంటుందని హరీశ్‌రావు తెలిపారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వమా? లేక స్కాంగ్రెస్ ప్రభుత్వమా అని ప్రశ్నించారు. ఒక మిషన్ లేదు, విజన్ లేదు, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్నది ఒక్కటే.. టార్గెట్ కమీషన్ అని విమర్శించారు. ప్రభుత్వం తీరు ఇలాగే కొనసాగితే ప్రజలంతా ఏకమై ఎక్కడికక్కడ నిలదీస్తారు తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు.




# యూరియా పరిస్థితులపై మంత్రి తుమ్మల ఆరా

**శామీర్‌పేట, ఆగస్టు 18(ప్రజాస్వారం) :**

రాష్ట్రంలో ప్రస్తుత యూరియా పరిస్థితులపై మంత్రి తుమ్మల జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల్లో యూరియా సరఫరా పరిస్థితులను అధికారులు మంత్రికి తెలియజేయగా, రైతులు ఇబ్బందులు పడకుండా తీసుకోవాల్సిన చర్యలను దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏప్రిల్ లో 1.7, మే లో 1.6, జూన్ లో 1.7, జులైలో 1.6, ఆగస్టులో 1.7 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా కేటాయించి, ఏప్రిల్ లో 1.21, మేలో 0.88, జూన్ లో 0.98, జులై లో 1.43, ఆగస్టులో 0.82 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేసిందని అన్నారు. కేటాయింపుల ప్రకారం రాష్ట్రానికి యూరియాను సరఫరా చేయలేకపోవటం వలన ప్రస్తుతం రాష్ట్రంలో 2.98 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటు ఏర్పడటంతో రైతులకు పంటకు సరిపడా యూరియాను ఒకేసారి అందించలేకపోతున్నాము. ప్రస్తుతం ఉన్న లోటును దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్లకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత నిల్వలపై పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలని, హోల్ సేల్, రిటైల్ డీలర్లు, సహకార సంఘాల గోదాములలో రోజువారి యూరియా స్టాక్ ను పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ నుండి వచ్చే రాక్స్ వివరాలను జిల్లా స్థాయిలో సమన్వయం చేసుకొని మండలాల వారీగా అవసరానికి అనుగుణంగా కేటాయింపు చేయాలని కలెక్టర్లకు సూచించారు. యూరియా సరఫరాలో చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పెద్ద రైతుల అవసరాలకు విడతల వారిగా సరఫరా చేసే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. అవసరమైతే పట్టాదారు పాసుపుస్తకాలు అనుసంధాన చేయాలన్నారు. రైతులకు టోకెన్లు జారీ చేసి ఎలాంటి గందరగోళం లేకుండా యూరియా సరఫరా చేయాలని, యూరియాను వ్యవసాయేతర అవసరాలకు మళ్లించకుండా, అన్ని శాఖల అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పరిచి అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, రాష్ట్రాల మధ్య అక్రమ రవాణా అడ్డుకునేలా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు. అధిక ధరలకు విక్రయించే లేదా ఇతర ఉత్పత్తులతో కట్టిపెట్టే ప్రైవేట్ డీలర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి, అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పారిశ్రామిక అవసరాలకు సబ్సిడీ యూరియా మళ్లించే అవకాశమున్న యూనిట్లపై తనిఖీలు చేసి, వారి ఉత్పత్తి గణాంకాలు, బిల్లులు సరిపోల్చి, ఏమైనా పెద్ద వ్యత్యాసం ఉంటే డీలర్ యూనిట్‌పై కేసులు నమోదు చేయాలపి అన్నారు. యూరియా వినియోగాన్ని సమీక్షించేందుకు ప్రతి నెల top 20 కొనుగోలుదారులు, తరచుగా కొనేవారు, అధికంగా అమ్మిన రిటైలర్ల వివరాలను (dbtfert.nic.in) వెబ్‌సైట్‌లో తనిఖీ చేయాలని, రైతులకు యూరియాను మితంగా ఉపయోగించాలనీ, నానో యూరియా, డిఏపి, ఎంఓపి, కాంప్లెక్స్ ఫెర్టిలైజర్స్, బయోఫెర్టిలైజర్స్ వంటివి వినియోగించమని ప్రోత్సహించేలా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. స్థానిక మీడియా ద్వారా ప్రకటనలు విడుదల చేసి, రైతులకు ప్రభుత్వం సమయానికి సరఫరా చేస్తున్నదని నమ్మకం కల్పించాలని అన్నారు. ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని, మండలాల వారీగా కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించి, వ్యవసాయశాఖ, పోలీస్, సహకార సంస్థలతో సమన్వయం చేసి పారదర్శకంగా పంపిణీ జరిగేలా చూడాలని అన్నారు. యూరియా సరఫరా సాధారణ స్థితికి చేరేవరకు కఠినంగా పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యూరియా సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్







**వికారాబాద్, ఆగస్టు 18(ప్రజా స్వరం):**

వానాకాలం పంట సాగుకు అవసరమైన యూరియా రైతులకు చేరేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వర రావు హైదరాబాద్ సచివాలయం నుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కే.రామకృష్ణ రావు, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్ రావు లతో కలిసి యూరియా, ఎరువుల లభ్యత పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సమీకృత జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్ పి నారాయణ రెడ్డి అదనపు కలెక్టర్ సుదీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మే చివరి వారంలో వర్షాలు ప్రారంభం కావడం, జూలై, ఆగస్టు నెలలో మంచి వర్షాలు కురువడం వల్ల రాష్ట్రంలో వరి, పత్తి, మిర్చి, పప్పు దినుసులు వంటి అనేక రకాల పంటలు రైతులు ఒకేసారి సాగు చేయడం, మన రాష్ట్రానికి కేటాయించిన యూరియా స్టాక్ సరఫరాలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వంటి వివిధ కారణాల వల్ల కొంత యూరియా సమస్య ఉందని అన్నారు. చైనా, జర్మనీ, ఇరాన్, యుమాన్ వంటి పలు దేశాల నుంచి రావాల్సిన యూరియా సరఫరా కావడం లేదని అన్నారు. మొత్తం మూడు లక్షల మెట్రిక్ టన్నుల తక్కువ సరఫరా జరిగిందని మంత్రి తెలిపారు. మన దగ్గర గతంలో ఉన్న 2 లక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ తో రైతులకు ఇప్పటి వరకు కొంత మేర సరఫరా చేసామని అన్నారు. రుణ మాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, ఉచిత కరెంట్ , రైతు బీమా, ధాన్యం కొనుగోలు వంటి అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం ఇప్పటివరకు లక్షా 13 వేల కోట్లు ఖర్చు చేసిందని, యూరియా కోసం రైతులు గంటల సమయం లైన్ లో నిలబడటం వల్ల కొంత అసంతృప్తి చెందుతున్నారని మంత్రి తెలిపారు. రాబోయే 45 రోజుల పాటు యూరియా సరఫరా పై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. మండల స్థాయిలో స్టాక్ వివరాలు మానిటరింగ్ చేయాలని, ఎక్కడ అవసరం ఉంటే అక్కడికి యూరియా తరలించాలని అన్నారు. ప్రస్తుతం ప్రైవేటు డీలర్ల వద్ద 35 వేల మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని, అది సక్రమంగా విక్రయం జరగాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న స్టాక్ పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, పరిశ్రమలకు యూరియా డైవర్ట్ కావడానికి వీలు లేదని, రైతులు అధికంగా స్టాక్ పెట్టుకోవద్దని, అవసరం మేరకే కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాలని అన్నారు. యూరియా సరఫరా పై పత్రికలో వ్యతిరేక వార్తలు రాకుండా ముందస్తుగా పరిస్థితుల గురించి పాత్రికేయులకు వివరించాలని అన్నారు. యూరియా సరఫరా చేసేందుకు చేపట్టిన చర్యలు రైతులకు మీడియా ద్వారా తెలిసేలా చూడాలని అన్నారు. సీఎస్ కే.రామకృష్ణారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఒక వైపు విస్తారంగా వర్షాలు కురుస్తున్నప్పటికీ యూరియా కొరత కొంత ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. జియో పొలిటికల్ కారణాల వల్ల దేశానికి యూరియా సరఫరా సరఫరా దెబ్బతిందని, రామగుండం ఆర్.ఎఫ్.సి.ఎల్ ప్లాంట్ లో సాంకేతిక కారణాల వల్ల ఉత్పత్తి పలుమార్లు నిలిచిపోవడం వంటి కారణాల వల్ల మన దగ్గర కొంత యూరియా కొరత ఉందని అన్నారు. యూరియా, ఇతర ఎరువుల లభ్యత వివరాలను కలెక్టర్ లు ప్రతిరోజు పర్యవేక్షించాలని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మార్క్ ఫెడ్, ప్రైవేట్ కంపెనీల వద్ద మండల స్థాయి వరకు స్టాక్ ఎంత ఉందో రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని అన్నారు. మండలాల వారీగా సాగు ఎంత అవుతుంది, ఎరువుల లభ్యత బేరీజు వేసుకొని అందుబాటులో ఉన్న ఎరువుల స్టాక్ సమర్థవంతంగా , శాస్త్రీయంగా కేటాయింపు చేయాలని సూచించారు. ప్రతిరోజు జిల్లాలకు ఎరువుల రేక్ స్టాక్ ఎంత వరకు రాబోతున్నాయి వంటి అంశాలను కలెక్టర్ కు ముందస్తుగా తెలియజేస్తామని అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న యూరియా వ్యవసాయం కోసం మాత్రమే వినియోగించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని, రైతులు ముందస్తుగా కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకోవద్దని, ప్రస్తుత అవసరాల కోసం మాత్రమే యూరియా కొనుగోలు చేయాలని అన్నారు.వ్యవసాయ అధికారులతో పాటు జిల్లాలో ఇతర ముఖ్యమైన అధికారులతో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి ప్రైవేట్ ఎరువుల డీలర్ల షాపు లను ఆకస్మిక తనిఖీ చేయాలని అన్నారు. యూరియా అవసరం ఉన్న పరిశ్రమలు జిల్లాలో ఉంటే వాటిని ఆకస్మిక తనిఖీ చేయాలని, వ్యవసాయ సంబంధిత ఎరువులను పరిశ్రమల కోసం వినియోగిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు. జూన్, జూలై నెలల్లో అధికంగా యూరియా కొనుగోలు చేసిన బయ్యర్స్, రెగ్యులర్ గా కొనుగోలు చేసే బయ్యర్స్ వివరాలను ట్రాక్ చేయాలని, వీరు ఎక్కడైనా యూరియా డైవర్ట్ చేస్తున్నారా పరిశీలించాలని అన్నారు. జిల్లాలలో అవకాశం ఉన్న చోట ప్రత్యామ్నాయంగా డ్రోన్ ద్వారా నానో యూరియా, డిఏపి కాంప్లెక్స్ ప్రోత్సహించాలని సి.ఎస్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్సు లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లా లో ఆగష్టు నెలకు సంబంధించి 11,200 మెట్రిక్ టన్నుల యూరియా ఉందని, ఇప్పటివరకు 4250 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయించడం జరిగిందని, వరి నాట్లు వేసే దశలో ఉన్నది, ఈ నెల చివరి నాటికి రైతులకు మొదటి దఫా యూరియ అందుబాటులో ఉందని, జిల్లా లో టాస్క్ పోర్సు బృందాలను ఏర్పాటు చేస్తామని , నానో యూరియ వాడకం పై రైతులకు అవగాహనా కలిపిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సు లో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, వ్యవసాయ అధికారి రాజా రత్నం, జనరల్ మేనేజర్ మహేశ్వర్, మార్కెటింగ్ అధికారి సారంగా పాణి , సంబంధిత అధికారులు తదితరలు పాల్గొన్నారు.

# బహుజన ధీరత్వానికి ప్రతీక సర్వాయి పాపన్న గౌడ్

- వికారాబాద్ జిల్లాలో ఘనంగా జయంతి వేడుకలు





**వికారాబాద్, ఆగస్టు 18(ప్రజా స్వరం) :**

బడుగు బలహీన వర్గాలకోసం, సామాజిక న్యాయం కోసం పోరాడిన తెలంగాణ యోధుడు _సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని పలువురు ప్రముఖులు అన్నారు. సర్వాయిపాపన్న 375వ జయంతి _ని పురస్కరించుకొని సోమ వారం జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గం లోని ప్రజలు సర్వాయి పాపన్న చిత్రపటాలకు, ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తాండూరు పట్టణంలోని వినాయక చౌక్ లోని పాపన్న గౌడ్ విగ్రహానికి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి వారితో పాటు రాష్ట్ర టీపీసీసీ ప్రచార సమన్వయకర్త కరణం పురుషోత్తం రావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బహుజన ధీరత్వానికి ప్రతీక పీడిత జనుల కోసం, బహుజనుల ఆత్మగౌరవం కోసం తన సర్వస్వాన్ని ధారబోసిన మహాయోధుడు సర్వాయి పాపన్న అని పరిగి పట్టణంలోని మాజీ శాసనసభ్యులు మహేష్‌రెడ్డి అన్నారు . ఆయన ఇంటి వద్ద సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు మాజీ ఎంపీపీ కరణం అరవింద్ రావు, సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి , శివన్నోళ్ల భాస్కర్, హనుమంత్ రెడ్డి , నాయకులు యువకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ మను చౌదరి



**శామీర్ పేట, ఆగస్టు 18(ప్రజాస్వరం) :**

ప్రజాల సమస్యలతో సమర్పించిన అర్జీలపై అధికారులు సత్వరమే స్పందించి, వాటిని పరిష్కరించుటకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కినినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఎల్,బి. హరిప్రియలతో కలసి కలెక్టర్ ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల వద్ద నుండి దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని, దరఖాస్తుల పై ఎండార్స్మెంట్ చేసి సంబంధిత శాఖల అధికారులకు సమర్పించారు. ప్రజలకు ప్రజావాణి నిర్వహణపై నమ్మకం కల్పించే బాధ్యత అధికారులపై ఉందని ఆయన తెలిపారు. స్వీకరించిన అర్జీలకూ అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. పెండింగ్ లో ఉన్న అర్జీలపై జాప్యం లేకుండా ప్రత్యేక దృష్టి సారించి, త్వరగా పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా జిల్లాలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ లో వచ్చిన దరఖాస్తుల పై అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించి పెండింగ్ లేకుండా చూడాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణిలో 65 అర్జీలు వచ్చాయని, అందులో ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యా, పౌరసరఫరాల శాఖ, ఇతర శాఖలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సంఘం కమిటీ ప్రమాణస్వీకారం చేసిన గట్టు హరిశంకర్




**శామీర్‌పేట, ఆగస్టు 18 ఆగస్టు(ప్రజాస్వరం) :**

మూడు చింతలపల్లి మున్సిపాలిటీ లోని జగన్ గూడ లోని కన్యకామేశ్వరి ఆలయంలో శనివారం ఉమ్మడి శామీర్ పేట్ మండలంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీ ప్రమాణస్వీకారం ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత హాజరయ్యారు.ప్రమాణ స్వీకారోత్సవం చందా నాగభూషణం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికైన గట్టు హరిశంకర్, ప్రధాన కార్యదర్శి మణిగండ్ల చంద్రశేఖర్, కోశాధికారి వర్ధ వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వల్లాల సంతోష్, కార్యనిర్వాహణ సెక్రెటరీ పాత నాగరాజు, పిఆర్ఓ భవనాసి శ్రీనివాస్, రాజకీయ కమిటీ చైర్మన్ మణిగండ్ల నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ గంగిశెట్టి గణేష్ బాబు, మెంబర్షిప్ కమిటీ చైర్మన్ మర్యాల మహేష్, యువజన విభాగ అధ్యక్షులు కోపూరి సంజయ్, మీడియా కమిటీ చైర్మన్ గుండాల ప్రవీణ్, మహిళ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షురాలు గంగా లలిత, ప్రధాన కార్యదర్శులు చందా మాధవి, కొంకమూర్తి లావణ్య, కోశాధికారులు కొవ్వరి రాణి, కొవ్వరి రాజలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శి వర్ధ పద్మని సౌమ్య, బేలె జగదీశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్ భవనాసి శ్రీలక్ష్మి, మణిగండ్ల లావణ్య, ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షుడు హరిశంకర్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికై ఎల్లవేళల కృషి చేస్తూ అందరి సలహాలు సూచనలతో ఏకధాటిపై అభివృద్ధి కోసం పాటుపడుతూ ముందుకు తీసుకెళ్లేందుకు ఎప్పుడు అందుబాటులో ఉండి అభివృద్ధికి తోడ్పడతానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కుటుంబసభ్యులు, ఆర్యవైశ్య సంఘం అభిమానులు శోభిరాశులు తదితరులు పాల్గొన్నారు.



# శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు

**శామీర్‌పేట, ఆగస్టు 18 (ప్రజాస్వరం) :**

శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసంలో శివ కేశవులను ఎంతో నిష్టతో ఆరాధిస్తారు. ఇందులో భాగంగా చివరి శ్రావణ సోమవారం పురస్కరించుకొని శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఎంతో భక్తిశ్రద్ధలతో స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం హారతి, మంత్రపుష్పం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

# భారీ వర్షాలపై జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసరమైతేనే ఇంటి నుండి బయటకు రావాలి
- రానున్న 48 గంటల్లో భారీ నుండి అతి భారీ వర్షా లు
- కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




**తూప్రాన్, ఆగస్టు18,ప్రజాస్వరం :** రానున్న 48 గంటల్లో జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు పడతాయని వాతవరణ శాఖ హెచ్చరికలు జారిచేయడంతో ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.ఈ సంధర్బంగా ఆయన సోమవారం మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ....రాష్ట్రంలో పటు చోట్ల భారీ నుండి అతి భారీ వర్షాలు పడుతున్న నేపద్యంలో దూర ప్రాంత పర్యటనలు వాయిదా వేసుకోని అత్యవసరమయితేనే బయటకు రావాలన్నారు.. రెవెన్యూ పోలీస్ పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి అధికారులను బృందాలుగా ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నమన్నారు. ఎక్కడైనా రోడ్లు తెగిపోవడం వంటివి జరిగితే, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ట్రాఫిక్ మళ్లింపు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని అదికారులను ఆదేశించామన్నారు. పొంగి పొర్లుతున్న వాగులు దాటకుండా అదికారులు పటిష్ట బందోబస్తు, బారికేడ్లు ఏర్పాటు చేశారన్నారు. చెరువులు, వాగులు, చెరువుల వద్దకు ప్రజలు వెళ్లకుండా నియంత్రిస్తున్నట్లు తెలిపారు.అదికారులంతా క్షేత్రస్థాయిలో విధుల్లో ఉంటూ, అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.ఎక్కడైన చెరువు కట్టలు తెగిపోతే ప్రమాదాలు జరగకుండా ఇసుక బ్యాగులు అందుబాటులో ఉంచామన్నారు. హల్ది వాగు పరివాహక ప్రాంతంలో ఉండే ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.ఎరవరికైన సహయం కావలనుకునే వారి కోసం కలెక్టర్ కార్యలయంలో,జిల్లా పోలిసు కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామన్నారు.సంప్రదించిన వారికి తక్షణ సహయం అందించనున్నట్లు పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి,ఎస్సై శివానందం,ఇరిగేషన్ ఈ ఈ శ్రీనివాస్ రావు, డిఈ శ్రీకాంత్, ఏఈ అనురాధ,పంచాయతీ రాజ్ డీ ఈ విజయప్రకాశ్, ఏ ఈ మధుసూదన్,పంచాయతీ సెక్రటరీలు,రెవెన్యు సిబ్బంది,మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.





# ఘనంగా శ్రావణమాసం ముగింపు ఉత్సవాలు

**వికారాబాద్, ఆగస్టు 18(ప్రజాస్వరం) :** శ్రావణమాసం ఆఖరి సోమవారం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా జిల్లాలోని బషీరాబాద్ మండలం నీలపల్లి అటవీ ప్రాంతంలోని ఏకాంబర రామలింగేశ్వర దేవాలయంలో పెద్ద ఎత్తున వార్షికోత్సవ జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. వేలాది సంఖ్యలో భక్తులు ఈ జాతర ఉత్సవాలకు హాజరై కోనేరులోని స్వామి వారిని (లింగేశ్వరుడిని) దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తో పాటు పలువురు నాయకులు ఏకాంబర రామలింగేశ్వర ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తాండూర్ డి.ఎస్.పి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తాండూర్ ఆర్టీసీ డిపో నుంచి జాతర ఉత్సవాలకు ప్రత్యేకంగా బస్సులు నడిపించారు. నారాయణపేట డిపో నుంచి కూడా ప్రత్యేక బస్సులు నడిపించారు. కాగా తాండూరు నియోజకవర్గం పెద్దముల్ మండలం ఇందోల్ అటవీ ప్రాంతంలోని అంబు రామన్న జాతర ఉత్సవాల్లో కూడా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే తాండూరు మండలం జిన్గుర్తి గ్రామం వద్ద ఉన్న రామలింగేశ్వర దేవాలయంలో కూడా పెద్ద ఎత్తున జాతర ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర దేవాలయంలో కూడా పెద్ద ఎత్తున ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వికారాబాద్ పట్టణంలోని రామాలయంలో కూడా ప్రత్యేక పూజ కార్యక్రమాలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరిగి నియోజకవర్గం కుల్కచర్ల పాంబండ రామలింగేశ్వర ఆలయంలో కూడా జాతర ఉత్సవాలు నిర్వహించారు.





## తూముకుంటలో మండల స్థాయి టిఎల్ఎం మేళ



**శామీర్ పేట ఆగస్టు 18(ప్రజాస్వామ్యం) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తూముకుంటలో శామీర్ పేట మండల స్థాయి టిఎల్ఎం మేలాను సోమవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ ప్రాథమిక పాఠశాలలు నుంచి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని వివిధ టిఎల్ఎం నమునాలని ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని శామీర్ పేట మండల విద్యాధికారి కమలాకర్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు వేణు, గోపాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు నాగ శారద, ఉపాధ్యాయులు తిరుమలేష్, వెంకట్రాం రెడ్డి, మహేష్, కుమార్, మిగతా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ టిఎల్ఎం మేలా నుండి 10 ఉత్తమ నమూనాలను జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరిగింది.

## ఉద్దమర్రి బ్రిడ్జి మూసివేత

**శామీర్ పేట, ఆగస్టు 18(ప్రజాస్వరం) :** గత కొన్ని రోజులుగా కూరుస్తున్న వర్షాల కారణంగా శామీర్ పేట, మూడుచింతలపల్లిలోని చెరువులు పొంగి పొర్లుతున్నాయి. ముఖ్యంగా లక్ష్మాపూర్ చెరువు భారీగా అలుగులు పారి వెళుతుండగా ఉద్దేమర్రి చెరువు నిండి శామీర్ పేట వాగులో కలుస్తు భువన గిరి మూసి వైపు వర్షపు నీళ్లు ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో మూడుచింతలపల్లి నుంచి కీసర వెళ్లే దారిలో ఉద్దమర్రి బ్రిడ్జి మీద నుంచి నీళ్లు వెళ్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా శామీర్ పేట పోలీసులు, రెవెన్యూ అధికార సిబంది హచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. ఈ వర్షం మరింత పెరిగే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమమతంగా ఉండాలని అధికారులు సూచించారు.



## ప్రచారం బాధ్యత మీదే

- అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలలో వందల కోట్ల రూపాయలతో చేస్తున్న అభివృద్ధి గురించి విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన బాధ్యత సోషల్ మీడియా వారియర్లదేనని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కోదాడ మేళ్లచెరువు కాశీనాథం ఫంక్షన్ హాల్‌లో రెండు నియోజకవర్గాల సోషల్ మీడియా వారియర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు నియోజకవర్గాలలో దవాఖానలు, రోడ్లు, సాగు నీరు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, ఎత్తిపోతల పథకాలు తదితర అభివృద్ధి పనులపై ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్టా, వాట్సాప్‌లలో పోస్టులు పొందుపర్చి క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించే విధంగా సోషల్ మీడియా వారియర్లు కృషి చేయాలన్నారు. నిబద్ధతగా పనిచేసే సోషల్ మీడియా వారియర్లకు సంపూర్ణ గౌరవం, గుర్తింపుతోపాటు తగిన సాయం కూడా చేస్తామని భరోసా ఇచ్చారు. సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా శ్రీధర్ రామస్వామి బాధ్యత వహిస్తారని మంత్రి చెప్పారు. తటస్థ ఓటర్లు సహాయక సంఘాలు, వాట్సాప్ గ్రూపులు, చానళ్లు సృష్టించి వారికి మన పోస్టులు చేరేవిధంగా చూడాలని సూచించారు. అదేవిధంగా తప్పుడు ప్రచారాలను ఖండించాలని, వాస్తవ పోస్టులను పొందుపరచాలని తెలిపారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు 600 పోలింగ్ బూతులకు సోషల్ మీడియా వారియర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. సెప్టెంబర్ 15న తిరిగి సమావేశం నిర్వహిస్తామని, బాధ్యతగా పనిచేసే వారియర్లకు గుర్తింపు కార్డులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు సోషల్ మీడియా వారియర్లు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దుచేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి




**శామీర్ పేట ఆగస్టు 18 (ప్రజాస్వరం) :** కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరుతూ సిపిఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ ఒకటో తారీకు రోజు ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన పిఆర్టియుటిఎస్ మహాధర్నా గోడపత్రికను మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందర టిజిఈ, టిజేఈ, జెఏసి చైర్మన్ రవి ప్రకాష్, సెక్రెటరీ జనరల్ వినోద్, పిఆర్టియుటిఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి ఆవిష్కరించారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల పాటు పాలించి సిపిఎస్ రద్దు చేయలేక ఉద్యోగులను మోసం చేసిందని నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సిపిఎస్ ను రద్దు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ విధానం 2004 సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి అమల్లోకి వచ్చిందని దానిని విద్రోహ దినంగా పాటిస్తూ దశాబ్ద కాలంగా ఉద్యమాలు చేస్తున్నామని వచ్చే సెప్టెంబర్ ఒకటవ తేదీన ఇందిరా పార్కు వద్ద పిఆర్టియు టీఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామని అందరూ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో నల్ల దుస్తులతో పాల్గొని నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. 30 ఏళ్లుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవి విరమణ పొందితే షేర్ మార్కెట్లపై ఆధారపడిన అసంబద్ధమైన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టి ప్రభుత్వం ఏర్పడగానే రద్దు చేస్తామని తెలిపారని ఆ మాట నిలబెట్టుకోవాలని కోరారు. ఐదు సంవత్సరాలు ప్రజాప్రతినిధిగా కొనసాగితే పెన్షన్ హక్కు ఉన్నప్పుడు. 30 ఏళ్లు ప్రభుత్వానికి ప్రజలకు సేవ చేస్తే పెన్షన్ హక్కు లేకపోవడం విచారకరమన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ సిస్టమ్ అని యుపిఎస్ విధానాన్ని ప్రవేశపెట్టిందని రెండు కూడా లోపభూయిష్టంగా ఉన్నాయని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి తీరాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేంతవరకు ఉద్యమిస్తూనే ఉంటామని తెలిపారు. ప్రతి ఒక్కరు ఒకటవ తేదీ రోజు సెలవు పెట్టి మహాధర్నాలో నల్ల దుస్తులతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుయ్యని






**తాండూరు ,ఆగస్టు 18 ప్రజాస్వరం) :** శ్రావణ సోమవారం సందర్భంగా వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం బషీరాబాద్ మండలంలోని ఏకాంబర రామలింగేశ్వర స్వామి వారి జాతర ఉత్సవాల్లో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం ఏకాంబర రామలింగేశ్వర దేవాలయం ఆవరణలో నిర్వహించిన రథోత్సవానికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో పాటు ఎమ్మెల్యే వతాన్ని కొంత దూరం మేర లాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారికి ఈ ప్రాంత ప్రజలు ముఖ్యంగా నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని దీవించాలని కోరుకున్నట్లు చెప్పారు.

## అంగన్వాడీ భవనాలకు స్థలాన్ని కేటాయించాలి

**గుమ్మడిదల, ఆగస్టు 18 (ప్రజాస్వరం) :** అంగన్వాడి భవనాలకు కావలసిన స్థలాన్ని కేటాయించాలన్న వినతితో గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన అంగన్వాడి టీచర్లు మండల తహసిల్దార్ పరమేశం కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు అర్చన,లావణ్య, మంగ,మాజీ సర్పంచ్ తులసీదాస్,రాహుల్ యాదవ్ తదిరులు పాల్గొన్నారు.



## వర్షాలపై రైతులకు ఏఈవో జాగ్రత్తలు



**గుమ్మడిదల, ఆగస్టు 18( ప్రజాస్వరం) :** మండలంలో ఈ వర్షాకాలంలో 2025 ఇప్పటి వరకు 500 ఎకరాలలో పత్తి,4,500 ఎకరాలు వరి,800 ఎకరాలు మక్కజొన్న,400 ఎకరాలు కందులు,220 ఎకరాలు కూరగాయలు మొత్తం అన్నిపంటలు కలిపి సుమారు 6,500 ఎకరాలు సాగులో వున్నాయి అని ప్రస్తుతం పత్తి పంట శాఖీయ దశలో వుంది.ముందుగా వర్షం నీరు బయటకు పంపించే ఏర్పాటు చేసుకోవాలి అని ఈ దశ లో వేరు కుళ్ళు తెగులు గమనిస్తే కాపర్ ఆక్సీ క్లోరైడ్3.0 గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా కార్బన్డాజిమ్ (భావిస్టిన్ )1 గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారీ చెయ్యాలి అని మొక్క జొన్న మరియూ కూరగాయలు పంటలలో నీళ్లు నిలవకుండా జాగ్రత్తలు పాటించాలి. అలాగే వర్షాలు తగ్గిన తర్వాత మాత్రమే ఎరువులు మరియు సూక్ష్మ మూలకాలు కలిగిన ఎరువులు వాడాలి. (19:19:19 లేదా మల్టీ కె.లేదా ఆగ్రోమిన్ మాక్స్ వంటివి పిచికారీ చెయ్యాలి). వరి పంటకు వర్షాలు తగ్గిన తరువాత మాత్రమే కాంప్లెక్స్ ఎరువులు వాడాలి. యూరియాకు బదులు నానో యూరియాను ఎకరానికి 500 ఎమ్.ఎల్ పిచికారీ చెయ్యాలి. ఎక్కడైనా పంటలు వరిగితే వెంటనే సరిచేసుకోవాలి. కూరగాయలు పంటలకు తెగులు సోకే ప్రమాదం ఉన్నందున తెగులు మందులు (బావిష్టిన్ లేదా ఎం 45) పిచికారీ చేయ్యాలి. గుమ్మడిదలలో పంటలు పరిస్థితిని ఏ.వో.డి శ్రీనివాసరావు రైతులకు ఈ విధంగా దిశ నిర్దేశం చేశారు! కార్యక్రమంలో ఏ.ఈ.ఓ.నిఖిత మండలంలోని రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# బహుజనులకు పోరాటస్ఫూర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

- **తెలంగాణ ఉద్యమంతోనే మహనీయులు వెలుగులోకి**
- **చరిత్ర తెలియకూడదనే రాజ్యాంగం పట్టుకుంటలేరు**
- **సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ను చంపినట్లే తనను అంతం చేయాలని చూస్తుడ్లు**
- **మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

**మంథని ప్రజాస్వరం**

బహుజన వర్గాలకు పోరాట స్ఫూర్తి సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. నవాబులను ఓడించి తొలి బహుజన రాజ్యాన్ని స్థాపించిన బహుజన యుద్ధ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మంథనిలోని సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మాట్లాడుతూ 375ఏండ్ల క్రితమే సర్ధార్ సర్వాయిపాపన్న గొప్ప సందేశం ఇచ్చారని గుర్తు చేశారు. ఆనాడు ఖిలాసాపూర్ కేంద్రంగా పోరాటాన్ని ప్రారంభించి గోల్కొండ ఖిలా ఎక్కి రాజుల పరిపాలనను అంతమొందించి ఏడు నెలలు రాజ్యం ఏలాడని ఆయన వివరించారు. దేశంలో మహనీయుల చరిత్రను తెలియనీయకుండా కప్పి పుచ్చే ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయని మనం ఆలోచన చేస్తే అర్థం అవుతుందన్నారు. తెలంగాణ ఉద్యమం మూలంగానే అనేక మంది మహనీయులు వెలుగులోకి వచ్చారని అన్నారు. చాకలి ఐలమ్మ, కొమురంభీం, దొడ్డికొమురయ్య, సర్వాయి పాపన్నలాంటి మహనీయులను స్మరించుకోవడానికి ఉద్యమమే కారణం అన్నారు. మహనీయుల స్ఫూర్తితో తెలంగాణాన్ని ఎలా సాధించుకున్నామో అదే స్ఫూర్తితో గోల్కొండ ఖిల్లాను సర్వాయి పాపన్న ఏలాడన్నాడు. సర్వాయి పాపన్న వారసుడిగా మంథనిలో తాను బహుజనుల కోసమే ఆరాటపడుతున్నానని, సామాన్య మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన తాను మహనీయుల స్ఫూర్తితో ఎమ్మెల్యే అయి రాజులుగా చెలామణి అవుతున్న ఒక కుటుంబ కబంధ హస్తాల్లో నలిగిపోతున్న ఈ సమాజాన్ని మెల్కొల్పాని తపన పడుతున్నానని అన్నారు. అయితే ఈ నియోజకవర్గంలో రాజ్యాంగం అర్థం కాకపోవడం, మహనీయుల చరిత్రను తెలుసుకోకపోవడం మూలంగా కేవలం నాలుగేండ్ల మూడు నెలల్లోనే అధికారం కోల్పోయామన్నారు. ఇక్కడ మహనీయుల చరిత్రను తెలియకుండా చేస్తున్నారని, కేంద్రంలో రాహుల్ గాంధీ రాజ్యాంగం పట్టుకుని తిరుగుతుంటే ఇక్కడ మాత్రం రాజ్యాంగం ముట్టుకోవడం లేదన్నారు. రాజ్యాంగం అర్థం అయితే ఆ కుటుంబం పాలన సాగదనే ఆలోచనలో ఉన్నారని, అసలు రాజ్యాంగం వచ్చేందే బహుజనుల కోసమని, ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల కోసమని ఆయన వివరించారు. రాజ్యాంగం లేకపోవడం, స్వాతంత్ర్యం రాకపోవడం మూలంగానే ఆనాడు సర్వాయి పాపన్న ఏడు నెలలే పాలన చేశారన్నారు. ఆతర్వాత ఆయనను ఎలా చంపేశారో అదే రీతిలో తనను అంతం చేయాలని కుట్రలు చేస్తున్నారని ఆయన అన్నారు. మహనీయుల చరిత్ర కంటే మా కుటుంబం చరిత్రపైనే చర్చ జరుగాలనే ఆలోచనలో కాంగ్రెస్ పార్టీ ఉందని, ఈ క్రమంలో తాను మహనీయుల వారసుడిగా ముందుకు వెళ్తేంటే కుట్రలు చేస్తున్నారని ఆయన అన్నారు. నాలుగేండ్లు కాదని నలుబై ఏండ్లు అధికారంలో ఉండే దిశగా బహుజనులంతా ఆలోచన చేయాలన్నారు. సర్వాయి పాపన్న ఆశయాలను వందకు వందశాతం ముందుకు తీసుకెళ్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎక్కేటి అనంతరెడ్డి,యెగోళపు శంకర్ గౌడ్, తగరం శంకర్ లాల్, ఆరేపల్లి కుమార్, గొబ్బూరి వంశీ, వేల్పుల గట్టయ్య, కనవేన శ్రీనివాస్ యాదవ్, జంజర్ల శేఖర్, ఆసిఫ్ ఖాన్ పుప్పాల తిరుపతి, మంతెన లక్ష్మణ్, రవీందర్, జావేద్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.



# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు ఘన నివాళి

- **కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి, ప్రజాస్వరం**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు జయంతి వేడుకలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఘన నివాళులు అర్పించారు. ఈ వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించారు. ఇందులో అదనపు కలెక్టర్ డి.వేణుతో పాటు పలు శాఖల అధికారులతో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు పాటుపడాలని జిల్లా కలెక్టర్ కోరారు. వీరోచిత పోరాటానికి, సమానత్వానికి ప్రతీకగా పాపన్న గౌడ్ నిలిచారని అన్నారు. గోల్కొం డ కోట నుంచి ఈ ప్రాంతాన్ని ఆయన పాలించారని, ప్రతి వర్గాన్ని తన పాలనలో కలుపుకొని వెళ్లారని అన్నారు. ఔరంగ జేబ్ ప్రపంచంలో మంచి కీర్తి సంపాదిస్తున్న సమయంలో ఒక సామాన్య వ్యక్తి నుంచి గోల్కొండ కోటను స్వాధీనం చేసుకుని పరిపాలన చేసే స్థాయికి పాపన్న గౌడ్ ఎదిగారని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం పాపన్న గౌడ్ పోరాటాలను గుర్తు చేసుకుం టూ ఆయన జయంతి వేడుకలను అధికారికంగా జరుపుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసి అభివృద్ధి అధికారి రంగా రెడ్డి, జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు ఎం .అంజయ్య గౌడ్, మాజీ ఎం పి పి గోపగాని సారయ్య గౌడ్, గౌడ సంఘాల నాయకులు బాలసాని వెంకటేశం గౌడ్, జాగిరి అంజి గౌడ్, పదాల సతీష్ గౌడ్, మూల మల్లేశం గౌడ్,బొబ్బిలి రాజమౌళి గౌడ్, కొండ సుజాత గౌడ్, బీసీ నాయకులు తాడూ రి శ్రీమాన్, నరేంద్ర, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల చిరకాల వాంఛ నెరవేరుతోంది

- **భద్రాద్రి రాముని సాక్షిగా చరిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం...**
- **లక్ష మందితో జరగనున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ మహోత్సవం..**
- **బెండలంపాడు గ్రామంలోసీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా 27 ఇళ్ల గృహప్రవేశం..**
- **పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా పేదలకు ఇళ్లు అందజేస్తున్న ప్రభుత్వం..**
- **ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.**

**భద్రాద్రి కొత్తగూడెం, ప్రజాస్వరం**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండలంపాడు గ్రామం లో ఈనెల 21న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు హాజరుకానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు మరియు అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, వైరా శాసన సభ్యులు రామదాస్ నాయక్, సత్తుపల్లి శాసన సభ్యులు మట్టరాగమయి తో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ....**

తెలంగాణ రాష్ట్రంలో గడిచిన పది సంవత్సరాల కాలంలో పేదలకు ఇల్లు అన్న కల కలగానే మిగిలిపోయింది అని అన్నారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఇందిరమ్మ పథకాన్ని పునఃప్రారంభించి, మొదటి విడతగా రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇండ్ల మంజూరుతో పేదవాడి చిరకాల వాంఛను ఈ పేదోడి ప్రభుత్వం అయినా ఇందిరమ్మ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు.ఈ శ్రావణ మాసం, 21వ తేదీన శుభ ముహూర్తంలో ముఖ్యమంత్రి స్వయంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చంద్రుగొండ మండలం బెండలంపాడు గ్రామంలో గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు అని తెలిపారు. ఈ గ్రామంలో మొత్తం 312 ఇండ్లు మంజూరయ్యగా, వాటిలో 72 ఇండ్లు పూర్తి అయ్యాయి. అందులో 27 ఇండ్లకు ముఖ్యమంత్రి చేతుల మీదగా గృహప్రవేశం జరగనుంది. గతంలో ఏ పేదవాడికీ అందని ఇళ్లను ఇప్పుడు ఈ ప్రభుత్వం పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా ప్రతి అర్హునికి అందజేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 22,500 కోట్ల రూపాయలతో 4.5 లక్షల ఇళ్లలో, సుమారు 2.5 లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. మిగిలిన ఇళ్లు కూడా ఇందిరమ్మ కమిటీల ద్వారా పారదర్శకంగా అర్హులైనవారికి ఎంపిక చేసి మంజూరు పత్రాలు అందజేయడం జరిగిందన్నారు.భద్రాద్రి రాముని సన్నిధిలో గతంలో ఈ పథకాన్ని ప్రారంభించాం. ఈరోజు అదే భద్రాద్రి నేలపై ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం జరగడం ఒక చారిత్రక ఘట్టం అని తెలిపారు. జిల్లాలో జరిగే ఈ మహోత్సవానికి సుమారు ఒక లక్ష మంది ప్రజలు పాల్గొంటారని అంచనా. కాబట్టి, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని గొప్ప విజయవంతం చేయాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను అన్నారు. 20వ తేదీ మధ్యాహ్నం నుంచే ఇక్కడ ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తాను అని మంత్రి తెలిపారు . అధికారులు చిన్నచిన్న తప్పిదాలు కూడా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పేదవాడి కలలను నిజం చేసే ఈ గృహప్రవేశోత్సవాన్ని ఘనవిజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

# వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

- **ఘనంగా సర్వాయి పాపన్న 375వ జయంతి వేడుకలను నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు**

**మంథని, ప్రజాస్వరం**



మొఘలుల సామ్రాజ్య నిరంకుశ పాలన కు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని మంథని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. సోమవారం మంథని పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు,గౌడ సంఘం నాయకులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్, రాష్ట్ర గౌడ సంఘం నాయకులు మాచిడి రవితేజ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, బీసీ సెల్ మండల అధ్యక్షులు అయిలి శ్రీనివాస్, మాజీ మండల యూత్ అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్, అజీమ్ ఖాన్, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జీ ఆరెల్లి కిరణ్ గౌడ్ లు మాట్లాడుతూ మొఘలు రాజులు వారు విధించినటువంటి పన్నులు, హింసించిన తీరుపై సర్దార్ పాపన్న తిరుగుబాటు చేయడం జరిగింది అని అన్నారు. బడుగు బలహీన వర్గాలను కలుపు కొని గోల్కొండ కోటపైన బహుజన జండా ఎరవేసి గోల్కొండ కోటను ఆస్థానంగా ఏర్పాటు చేసుకొని గోల్కొండ కోట నుండి పరిపాలన చేశారన్నారు. అనేక కోటలను సామంత రాజులను జయించి బహుజన రాజ్యాన్ని ఏర్పాటు చేశారని,ఆ మహనీయుని స్ఫూర్తితో రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గంలో బడుగుబలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని వారన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాదుల శ్రీకాంత్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మంథని రాకేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు ఆర్ల నాగరాజు, మాజీ సర్పంచ్ దొరగొర్ల శ్రీనివాస్ యాదవ్, రాజిరెడ్డి, గట్టయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు ఆరెల్లి వరుణ్, ఎరుకల సురేష్, పోగుల సాగర్, గౌడ సంఘం నాయకులు టి.రాజు, పూదరి సమ్మయ్య గౌడ్, మాచిడి మోహన్, పోన్నం చంద్రయ్య, మాచిడి సదాశివ్, భీముని రాములు, మాచిడి లింగయ్య, కొండ్ర శ్రీనివాస్, వేగోల్లపు చిన్న శంకర్, తాటి శ్రీనివాస్. ఆరెళ్ళి మల్లయ్య, మాచిడి కిష్టయ్య, తాళ్లపల్లి సత్యనారాయణ, మాచిడి బాపు, తాటి శ్రీదర్, తాటి శంకర్, మాచిడి బాపు,కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# చేనేత ఉత్పత్తులపై జిఎస్టీని తొలగించాలి

- **మంత్రి తుమ్మల**

**హైదరాబాద్, ప్రజాస్వరం**

చేనేత ఉత్పత్తులపై వెంటనే జిఎస్టీని తొలగించాలని ప్రధాని, కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రికి రాష్ట్ర వ్యవసాయ, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాసారు. తెలంగాణ రాష్ట్ర హస్తకళల పరిశ్రమకు ఊపిరిలాంటి చేనేత రంగం, చేనేత ఉత్పత్తులపై కేంద్రం విధించిన 5 శాతం జిఎస్టీ వలన ప్రస్తుతం చేనేత రంగం తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటోందని మంత్రి తెలిపారు. వ్యవసాయం తర్వాత ఎక్కువమందికి ఉపాధి కల్పించే ఈ రంగం, గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మంది కార్మికులకు జీవనాధారం అవుతున్నదన్నారు. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ కాటన్ మరియు పట్టు చీరలు, నారాయణపేట కాటన్ మరియు పట్టు చీరలు,సిద్దిపేట గొల్ల భామ చీరలు, వరంగల్ దర్రీస్, కరీంనగర్ క్లాత్ చెద్దర్లు, ఇతర చేనేత వస్త్రాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయని, వీటిలో ఆరు ఉత్పత్తులు జియోగ్రాఫికల్ ఇండికేషన్ కింద నమోదు అయ్యాయని మంత్రి వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 23,046 మంది చేనేత కార్మికులు, 34,569 మంది అనుబంధ కార్మికులు ఈ రంగంలో పని చేస్తున్నారని చెప్పారు.అయితే, ముడి సరుకుల ధరలు పెరగడం, పవర్లూమ్ & మిల్ రంగాలు తక్కువ ఉత్పత్తి వ్యయంతో వస్త్రాలు తయారుచేయడంతో, మార్కెట్లో చేనేత వస్త్రాలు తయారుచేసే నేత కార్మికులకు గిరాకి లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు 5% జీఎస్టీ విధించడం వల్ల చేనేత ఉత్పత్తుల ధరలు పెరిగి వినియోగం తగ్గిపోతుందని, కార్మికుల జీవనాధారం సంక్షోభంలో పడుతోందని ఆయన తెలిపారు. జీఎస్టీ కారణంగా నష్టపోతున్న నేతన్నలు తమ సంప్రదాయ వృత్తిని వదిలి వలస వెళ్ళాల్సిన పరిస్థితి వస్తోందన్నారు.తెలంగాణ రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలు మరియు ఉత్పత్తిదారుల సంఘాలు మరియు కార్మికులు ఈ పన్నును వ్యతిరేకిస్తూ నిరసనలు వ్యక్తం చేస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో, చేనేత కార్మికుల ప్రయోజనాలను కాపాడటానికి, వారి నిరంతరం ఉపాధి కల్పించడానికి మరియు భారతీయ చేనేతకళా వారసత్వాన్ని భావితరాలకు అందించడానికి చేనేత ఉత్పత్తులపై పన్ను మినహాయించే విధంగా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు.

# రాష్ట్రంలో యూరియా సమస్యను వెంటనే పరిష్కరించండి



- **ఈనెల 21నాటికి సమస్య పరిష్కరిస్తామన్న కేంద్రమంత్రి జెపి నడ్డా**
- **బిజెపి అధ్యక్షుడు, కేంద్రమంత్రి జెపి నడ్డాతో మంత్రి నారా లోకేష్ భేటీ**

**న్యూఢిల్లీ, ప్రజాస్వరం**

బిజెపి జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, ఎరువులు, రసాయనాల శాఖల మంత్రి జెపి నడ్డాతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో ముమ్మరంగా వ్యవసాయ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో యూరియా కొరత ఉంది, వెంటనే రాష్ట్రానికి అవసరమైన యూరియా కేటాయించాలని కోరారు. దీనిపై కేంద్రమంత్రి నడ్డా స్పందిస్తూ... ఈనెల 21నాటికి ఆంధ్రప్రదేశ్ కు 29వేల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిస్తాం, రాష్ట్రంలో యూరియా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ లో స్థానిక పరిశ్రమల అభివృద్ధి, యువతకు ఉపాధి కోసం ప్లాస్టిక్ పార్కు ఏర్పాటుకు సహకారం అందించాలని మంత్రి లోకేష్ కోరగా, జెపి నడ్డా ఆమోదం తెలిపారు. విశాఖపట్నంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (NIPER) శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. ఇందుకు అవసరమైన 100 ఎకరాల భూమి సిద్ధంగా ఉందని లోకేష్ చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 14నెలలుగా కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని లోకేష్ ఈ సందర్భంగా వివరించారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు సహకారం అందించాలని విజ్ఞప్తిచేశారు. కేంద్రప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం, అమరావతి రాజధాని పనులు మళ్లీ పట్టాలెక్కాయని చెప్పారు. డబుల్ ఇంజన్ సర్కారుతో ఆంధ్రప్రదేశ్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు.



# కోటి మందికి ఏఐ ఆధారిత పౌర సేవలు

- 2027 నాటికి అందించాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం
- 20 శాఖలకు చెందిన 250 మంది అధికారులకు ప్రత్యేక శిక్షణ
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హైదరాబాద్, ప్రజాస్వరం

2027 నాటికి ఏఐ ఆధారిత పౌర సేవలను కోటి మంది ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'ఏఐ లెడ్ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ ఛాంపియన్స్ & కాటలిస్ట్స్ ప్రోగ్రామ్' పేరిట ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్ (ఐటీ శాఖ) ఆధ్వర్యంలో ప్రభుత్వాధికారులకు జూబ్లీహిల్స్ లోని డా.ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్స్టిట్యూట్ లో మూడ్రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తమది సమస్య వచ్చిన తర్వాత స్పందించే ప్రభుత్వం కాదన్నారు. ముందుగానే ఊహించి పరిష్కరించే చురుకైన, పారదర్శకమైన, ముందుచూపున్న ప్రభుత్వమన్నారు. ఏఐ సహకారంతో ప్రజలు అడగకుండానే వారి ముంగిటకు పౌర సేవలను చేర్చే సరికొత్త తెలంగాణను నిర్మించాలన్నదే తమ సంకల్పమన్నారు. ఈ కొత్త తెలంగాణ 5 బిలియన్ డాలర్ల ఏఐ ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా మారుతుందని, వేలాది ఉద్యోగాలను సృష్టిస్తుందని వివరించారు. 'ఏఐ క్యాపిటల్ ఆఫ్ ది గ్లోబ్ గా తెలంగాణ'ను తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ ను అందుబాటులోకి తేబోతున్నామని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్ ఛేంజ్ ను ప్రారంభించి ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలిచామన్నారు. ఇదే స్ఫూర్తితో 20 ప్రభుత్వ శాఖలకు చెందిన 300 రకాల పౌర సేవలను ఏఐ ఆధారిత ప్లాట్ ఫాంపై అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం ఆయా శాఖల నుంచి 250 మంది అధికారులను ఎంపిక చేసి... ఏఐ వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వీరికి మూడు నెలల పాటు ఏఐ నిపుణులు మెంటార్లుగా వ్యవహరించి మార్గదర్శకత్వం చేస్తారని వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, డిప్యూటీ సెక్రెటరీ భవేష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



# ఘటనా స్థలాన్ని సందర్శించిన సీఎండీ

మేడ్చల్, ప్రజాస్వరం

రామాంత పూర్ లో జరిగిన సంఘటనను పురస్కరించుకుని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ, సోమవారం సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఇందుకు సంబందించిన పూర్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెండు బిల్డింగ్ లను అనుసంధానం చేస్తూ నిరుపయోగంగా పడి వున్న స్టార్ కేబుల్ వైర్ తెగి 11 కేవీ ఓవర్ హెడ్ లైన్ మీదుగా జారి ఐరన్ ఫ్రేమ్ తో రూపొందించిన రథానికి తగిలిందని, ఆ కేబుల్ లో వున్న కాపర్ వైర్ ద్వారా విద్యుత్ ప్రసరణ జరగడంతో ఈ దుర్ఘటన జరిగిందని అధికారులు సీఎండీ కి వివరించారు. సంఘటన జరిగిన వెంటనే అధికారులు అక్కడికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు పరిశీలించారు. ఈ సంఘటనలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం లేదని అధికారులు తెలిపారు. సంఘటన జరిగిన ప్రదేశంలో 11కె.వి లైన్ 20 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉన్నది. దీనికి తోడు గతంలోనే LT ఓవర్ హెడ్ లైన్ స్థానంలో ఏబీ కేబుల్ ను అమర్చామన్నారు. ఈ సంఘటనకు బిల్డింగులను అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేసిన కేబుల్ వైరే ప్రధాన కారణం అని తెలుసుకున్నారు. ఈ సంఘటపై మరింత లోతుగా దర్యాప్తు చేసి నివేదిక అందించాల్సిందిగా హబ్సిగూడ సూపెరింటెండింగ్ ఇంజనీర్ ప్రతిమ షోమ్ ని సీఎండీ ఆదేశించారు.

# ఎకో ఎత్నిక్ విలేజ్ ప్రారంభించిన మంత్రి సీతక్క

ములుగు, ప్రజాస్వరం



సోమవారం ములుగు మండలం ఇంచెర్ల గ్రామంలో 37 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఎకో ఎత్నిక్ విలేజ్, డెవలప్మెంట్ వర్క్స్ ఫౌండేషన్ స్టోన్ ను రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ తెలంగాణ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలిసి శంకుస్థాపన చేశారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

జమ్మికుంట,ప్రజాస్వరం



సోమవారం జమ్మికుంట పట్టణంలో దేశిని కోటి, ఆరెల్లి మల్లయ్య, రాజు గౌడ్,ల ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న,విగ్రహానికి పూలమాలవేసి కేక్ కట్ చేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్, .జమ్మికుంట మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాస్,లు పాల్గొన్నారు వారు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి దేశిని కోటి, మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమం జమ్మికుంటలో ఘనంగా నిర్వహించామని సర్దార్ సర్వాయి పాపన్న 350 సంవత్సరాల క్రితమే ఎస్సీ బీసీ బహుజన కులాలను అణచివేస్తున్న సందర్భంలో భూస్వాములు, పెత్తందారులు పై సర్దార్ సర్వాయి పాపన్న తిరుగుబాటు చేసి బహుజన కులస్తులందరినీ ఏకం చేసి హైదరాబాద్ గోల్కొండ ఖిల్లా పై మొగల్ సామ్రాజ్యంపై తిరుగుబాటు చేసి వారిని ఓడించి గోల్కొండ సామ్రాజ్యాన్ని కొన్ని సంవత్సరాలు పాలించారని. సర్దార్ సర్వాయి పాపన్న ఆయన ఆశయ సాధనను స్ఫూర్తిని మనం తీసుకోవాలని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్న సర్వేపేటలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహంతో పాటు ఆ గుట్టను కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నారని వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు నిర్వహించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. .జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ అయాజ్, ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించినందుకు వారికి కూడా ధన్యవాదాలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో జమ్మికుంట పుర ప్రముఖులు సుంకరి రమేష్, పరశురాం, మాజీ సర్పంచ్ పొనగంటి మల్లయ్య, గూడెపు సారంగపాణి, హమాలి సంఘం అధ్యక్షులు రాజేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు బొంగోని వీరన్న, శ్రీపతి నరేష్, పొన్నగంటి సారంగపాణి, దేశిని రాధా సదానందం, నాయకులు పూదరి రేణుక శివ, తోట స్వప్న, పిడుగు భాగ్యలక్ష్మి, బొంగొని సదానందం, సట్ల చిరంజీవి. చిలుముల రామస్వామి, వోజ్జ శీను, రామచంద్రం, సంపత్, యూత్ నాయకులు సునీల్, ఖలీల్, శివకృష్ణ, మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ సదానందం, తదితరులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు..

# ఘనంగా సర్వాయి పాపన్న జయంతి వేడుకలు


జయశంకర్ భూపాలపల్లి, ప్రజాస్వరం

సామాజిక న్యాయం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 జయంతి వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, అధికారులు, గౌడ సంఘం నాయకులు పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దోపిడి వ్యవస్థకు ఎదురుతిరిగి పోరాడిన గొప్ప యుద్ధ వీరుడని కొనియాడారు. దోపిడి, భూస్వాముల, పెత్తం దారి వ్యవస్థకు ఎదురొడ్డి పోరాడిన ఉద్యమ కారుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 17 వ శతాబ్దంలోనే దోపిడి, భూస్వాముల పెత్తం దారి వ్యవస్థకు ఎదురు తిరిగిన గొప్ప బహుజన విప్లవకారుడు అన్నారు. గౌడ కుటుంబంలో పుట్టి వివిధ కులాలకు చెందిన 12 మంది స్నేహితులతో సైన్యాన్ని స్థాపించి 12 మంది నుండి 12 వేల మంది సైనికులను తయారు చేసి గోల్కొండ కోటపై యుద్ధం చేసి గోల్కొండ కోటలో జెండా ఎగరేసిన గొప్పవీరుడని అన్నారు. ప్రజలలో సమానత్వం, ధైర్యం, దేశభక్తిని పెంపొందించేలా కృషి చేసిన పాపన్న జీవితాన్ని నేటి ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. నిజాం పాలకులకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి బహుజనుల అభ్యున్నతికి కృషి చేశారని, అన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా ప్రభుత్వం నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి సర్వాయి పాపన్న గౌడ్ జన్మదిన శుభాశుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, బీసీ సంక్షేమ అధికారి క్రాంతి కిరణ్, గౌడ సంగం జిల్లా అధ్యక్షులు పభాకర్ గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు గాజర్ల అశోక్, గౌడ వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమానత్వానికి ప్రతీకగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

- నిరంకుశ పాలనకు ఎదురొడ్డి, అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన పాపన్న గౌడ్
- అదనపు కలెక్టర్ బి.ఎస్.లత

జగిత్యాల,ప్రజాస్వరం




వీరోచిత పోరాటానికి, సమానత్వానికి ప్రతీకగా పాపన్న గౌడ్ నిలిచారని, బహుజనుల ఆత్మగౌరవం కోసం తన సర్వస్వాన్ని ధారబోసిన మహాయోధుడు సర్వాయి పాపన్న అని అదనపు కలెక్టర్ బిఎస్ లత తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొఘల్ సామ్రాజ్యాన్ని సర్వాయి పాపన్న కూలదోసి గోల్కొండ కోటపై జెండాను ఎగరవేసి బహుజనులకు రాజ్యాధికారం కావాలని రాజకీయ చైతన్యాన్ని పరిచయం చేశాడన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు పాటుపడాలని కోరారు. వీరోచిత పోరాటానికి, సమానత్వానికి ప్రతీకగా పాపన్న గౌడ్ నిలిచారని అన్నారు. బహుజనుల ఆత్మగౌరవం కోసం తన సర్వస్వాన్ని ధారబోసిన మహాయోధుడు సర్వాయి పాపన్న. నిరంకుశ పాలనకు ఎదురొడ్డి, అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన పాపన్న గౌడ్ జయంతిని ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం పాపన్న గౌడ్ పోరాటాలను గుర్తు చేసుకుంటూ ఆయన జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, మెట్ పల్లి ఆర్డీవోలు మధుసుధన్, శ్రీనివాస్, జిల్లా బీసి అభివృద్ధి అధికారి సునీత, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వీరత్వానికి, బహుజన రాజ్య స్థాపనకు అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత వీరుడు పాపన్న గౌడ్

- ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

జగిత్యాల, ప్రజాస్వరం



తెలంగాణ వీరత్వానికి, బహుజన రాజ్య స్థాపనకు,సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కొనియాడారు.సోమవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375 వ జయంతి సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో బైపాస్ రోడ్డు గొల్లపల్లి రోడ్డు చౌరస్తా లో ఆయన జయంతి వేడుకలో ఎమ్మెల్యే పాల్గొని పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గొప్ప వారి సేవలు స్మరించుకోవడం ద్వారా నేటి యువకులకు వారి ఆశయాలు,వారి జీవనం ఆదర్శంగా ఉంటాయిన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందని,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం కృషి చేస్తుందని ఢిల్లీలో జంతర్మంతర్ వద్ద సైతం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రిజర్వేషన్ అమలుకు ధర్నా కార్యక్రమం చేపట్టిందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ కూడా గౌడ కుల వృత్తి రక్షణకై కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారని ఇది ఒక గొప్ప కార్యక్రమం అన్నారు.గొల్లపెల్లి చౌరస్తాకు సర్వాయి పాపన్న చౌరస్తాగా నామకరణం చేయడం జరిగిందని అన్నారు అన్ని వర్గాల అభ్యున్నతికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు,మాజీ లైబ్రరీ చైర్మన్ డా చంద్ర శేఖర్ గౌడ్,ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్,కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి,గౌడ సంఘం సభ్యులు,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలి

- రాజ్యాంగాన్ని అవమానించింది కాంగ్రెస్సే...
- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్..

జగిత్యాల,ప్రజాస్వరం

రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర జరుగుతుందని దాన్ని అంబేద్కర్ వాదులు తిప్పికొట్టాలని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టి అంబేద్కర్ ని రాజ్యాంగాన్ని అవమానించిన కాంగ్రెస్ పార్టీ విధానాన్ని ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీ చేసిన చేస్తున్న కుట్రలను బయటపెట్టాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ అంబేద్కర్ వాదులను కోరారు.సోమవారం పెగడపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ఒక వర్గం మెప్పుకోసం అత్యధిక సార్లు సవరించి అంబేద్కర్ ను రాజ్యాంగాన్ని అవమానించింది కాంగ్రెస్ పార్టీయేనని 1962లో భారత పార్లమెంటుకు జరిగిన ప్రత్యక్ష ఎన్నికల్లో అంబేద్కర్ పై నెహ్రూ ఇంట్లో పనిమనిషిని పోటీకి దింపి అంబెద్కర్ కి వ్యతిరేకంగా ప్రచారం చేసి ఎన్నికల్లో ఓడగొట్టి అడుగడుగునా అవమానించిన నీచమైన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి అంబేద్కర్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో 370 ఆర్టికల్,35(A),మైనారిటీ కమిషన్, వక్ఫ్ బోర్డు లాంటి అంశాలు లేవని అన్నారు. 1975లో భారత ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించి ఎలాంటి క్యాబినెట్ ఆమోదం లేకుండానే సామ్యవాదం, లౌకికవాదం అనే పదాలను రాజ్యాంగ పీఠికలో బలవంతంగా చేర్పించి అంబేద్కర్ ని అవమానపరిచింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి అంబేద్కర్ మీద అంత ప్రేమ ఉంటే 1993లో కాంగ్రెస్ ప్రభుత్వం భారతరత్న ప్రకటించి ఎందుకు ప్రధానం చేయలేదని ప్రశ్నించారు. 2014లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చాకనే భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారతరత్న ప్రధానం చేసి వారి చిత్రపటాన్ని పార్లమెంటు సెంట్రల్ హాల్లో ఆవిష్కరించి అంబేద్కర్ పుట్టిన, చదివిన, మరణించిన ఐదు ప్రదేశాలను పంచ తీర్థాలుగా అభివృద్ధి చేసి ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది అంబెద్కర్ కి అరుదైన గౌరవం ఇచ్చిన ఘనత మోడీ ప్రభుత్వానిదేనని అన్నారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబర్ 26రోజును రాజ్యాంగ దినోత్సవంగా అధికారికంగా జరిపించి అంబేద్కర్ జయంతిని ఐక్యరాజ్యసమితి చేత ఆమోదింపజేసి ప్రపంచ విజ్ఞాన దినోత్సవంగా ప్రకటింపజేసిన ఘనత కూడా మోడీ ప్రభుత్వానిదేనని అన్నారు. అందుకని దేశంలోని మేధావులు విద్యావంతులు అంబేద్కర్ వాదులు ఈ విషయాలను గమనించి రాజ్యాంగం ప్రమాదంలో పడుతుందని కాంగ్రెస్ పార్టీ భారత రాజ్యాంగాన్ని నెత్తిన పెట్టుకొని చేస్తున్న దుష్ప్రచారాన్ని కుట్రలను అంబేద్కర్ వాదులు తిప్పికొట్టాలని అన్నారు..